


**సూర్యాపేట పట్టణాభివృద్ధికి అవిరళ కృషి**


# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

ఆదివారం | 15 ఫిబ్రవరి , 2026 | పేజీలు : 05


## యాదాద్రి జిల్లాలో మున్సిపల్ ఫలితాలు

# ప్రజా ప్రభుత్వ పని తీరుకు నిదర్శనం

### ముందే చెప్పి మరీ చేసి చూపించాం... యాదాద్రిలో ఆరు మున్సిపల్ పీఠాలను కైవసం చేసుకుంటామన్నాం గెలిచి చూపించాం : ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/ఆలేరు :** యాదాద్రి జిల్లాలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆరు మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురేస్తామని ఎలక్షన్ ప్రచారంలో చెప్పిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, చెప్పిందే అమలు చేశామని అన్నారు. బీర్ల అయిలయ్య ఆలేరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం పట్టణ అధ్యక్షుడు ఎంఏ ఎజాజ్ అధ్యక్షతన జరిగిన వేలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలన ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మరింత చేరువైందన్నారు. జిల్లాలోని అన్ని చైర్మన్ స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఇందుకు నిదర్శనం అన్నారు. గతంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో జిల్లాలో అత్యధిక స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకున్న విషయం గుర్తు చేశారు. రాబోయే జెడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికల్లో కూడా ఇది పునరావృతం అవుతుందన్నారు.సామాజిక పొందుకలో కొందరికి సీట్లు రానివారు అధైర్య పడాల్సిన పని లేదన్నారు.మార్కెట్ కమిటీ పిఎసిఎస్ కార్పొరేషన్లుల లో నామినేట్ పోస్టులలో వారికి అవకాశం ఉంటుందన్నారు. బిఆర్ఎస్ పార్టీ. బిజెపికి లోపాయికారిగా సహకరించడం వల్లే యాదిరిగుట్టలో ఆ రెండు సీట్లు బిజెపికి వచ్చాయి.కేవలం ఒకే ఒక సీటు బీఆర్ఎస్ పరిమితమైందన్నారు. ఆలేరులో 54 శాతం ఓట్లు కాంగ్రెస్ పార్టీ వైపు వస్తే బీఆర్ఎస్ కు కేవలం 34 శాతం ఓట్లే వచ్చాయని20 శాతం ఓట్లతో కాంగ్రెస్ చాలా ముందున్న విషయం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాల వల్ల ప్రజా ప్రభుత్వం ప్రజ పాలన ద్వారా ప్రజల మన్ననలు పొందుతుందన్నారు. ఆలేరులో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు మాజీ ఎమ్మెల్యేలు సునీత మహేందర్ రెడ్డి బిక్షమయ్య గౌడ్ కల్లూరు రామచంద్రారెడ్డి ఎన్ని కుయుక్తులు పన్నిన ప్రజలు మూడు సీట్లకు పరిమితం చేశారన్నారు. గొంగిడి మహేందర్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టి బిఆర్ఎస్ క్లీన్ షిప్ చేస్తుందని ప్రగల్బాల్ పలికావు రెండు మున్సిపాలిటీల్లో కేవలం నాలుగు స్థానాలకు నీ పార్టీనీ పరిమితం చేశావెందుకు అని ప్రశ్నించారు. కమ్యూనిస్టులు కాంగ్రెస్ ధైర్యంగా ప్రజల ముందుకు వెళ్లి 16 స్థానాలు కైవసం చేసుకుందన్నారు. బిజెపికి అవయవ దానం చేసి నాలుగు స్థానాలు గెలిపించవన్నారు. ధైర్యం ఉంటే బిజెపి బిఆర్ఎస్ కలిసి పోటీ చేయొచ్చు కదా అని హెద్దేవ చేశారు. రెండు మున్సిపాలిటీలో 24 స్థానాల్లో 67% కౌన్సిలర్లుగా కాంగ్రెస్ వైపు నుండి గెలిస్తే బిజెపి బీఆర్ఎస్ చీకటి ఒప్పందం చేసుకొని కూడా 33 శాతానికి కౌన్సిలర్లుగా ఎనిమిది సీట్లకు పరిమితమయ్యారని బిఆర్ఎస్ కనీస పోటీ ఇవ్వలేకపోయింది అన్నారు. గుట్ట ఆలేరులో ఓటేసి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమిష్టి కృషి వల్ల ఈ విజయం సాధించమన్నారు ఈ కార్యక్రమం లో మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ బంద్రు శోభారాణి, టిపిసిపి జనరల్ సెక్రటరీ జనగామ ఉపేందర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ వెంకట స్వామి, సిపిఐఎం పట్టణ కార్యదర్శి ఎం ఏ ఎక్బల్, సిపిఐ మండల కార్యదర్శి చెక్క వెంకటేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏగ్గిడి యాదగిరి, కట్టెగొమ్ముల సాగర్ రెడ్డి, విజయకుమార్, ఆకవరం మోహన్ రావు, ఎండి జైనుద్దీన్, చింతల ఫణి శ్రీనివాస్ రెడ్డి, దూడం మధు కుమార్,ఎండి బాబా తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 16,17ఎఐఎస్ఎఫ్ నల్లగొండ జిల్లా 24వ మహాసభలు

### జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమల్ల ఆంజనేయులు పిలుపు




**ప్రజాపక్షం/దేవరకొండ:** ఫిబ్రవరి 16, 17 తేదీల్లో హాలియా పట్టణంలో జరిగే ఎఐఎస్ఎఫ్ నల్లగొండ జిల్లా 24వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన ఏఐఎస్ఎఫ్ దేవరకొండ డివిజన్ 19వ మహాసభకు ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య 1936 ఆగష్టు 12న ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో ఆవిర్భవించి బ్రిటిష్ సామ్రాజ్యవాదులు భానిస చెర నుండి మాతృ భూమి విముక్తికై సాగిన విరోచిత స్వాతంత్రోద్యమంలో పొత్తిళ్ళలోనే పిడికిలి బిగించి స్వాతంత్ర్యం మా జన్మ హక్కు అని చాటి మా అంతం చూసిన స్వాతంత్ర్యోద్యమం పంతం వీడం అంటూ నినదించి దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎంతో మంది విద్యార్థుల ప్రాణాలను బలిదానం చేసిన ఘనమైన చరిత్ర కలిగిన ఏకైక విప్లవ విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. 90 సంవత్సరాలుగా దేశ సమగ్రత కోసం, విద్యార్థుల శ్రేయస్సు కోసం అశేష త్యాగాలు చేస్తూ ఆవిర్భవం నాటి నుండి నేటి వరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలే ఊపిరిగా, పోరాటాలే ప్రాణంగా, విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా చదువుతూ పోరాడతాం చదువుకై పోరాడుతాం అంటూ అలుపెరుగని సమరశీల పోరాటాలు నిర్వహిస్తూ దేశంలోనే అతి పెద్ద నిర్మాణాత్మక సంఘంగా ఏఐఎస్ఎఫ్ ఉన్నదని అన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తూ 2 సంవత్సరాలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని ఇంతవరకు నియమించలేదని , విద్యారంగంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయకుండా, ప్రభుత్వ కళాశాలలో, పాఠశాలలలో, యూనివర్సిటిలలో, సంక్షేమ హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తూ ఇంటర్, డిగ్రి, పిజి కోర్సులను ఎత్తివేస్తూ ప్రభుత్వం విద్యను నిర్వీర్యం చేస్తుందని, సంక్షేమ హాస్టళ్లలలో ఫుడ్ పాయిజన్ జరిగి విద్యార్థులు మరణిస్తున్నా ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితిలో లేదని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేసే ఆలోచనే లేదన్నారు. పేదా, మధ్య తరగతి విద్యార్థులకు ఆసరగా ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ పెండింగ్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలలతో చెలగాటం ఆడుతుందని అన్నారు. భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించుకునేందుకు 2026 ఫిబ్రవరి 16, 17 తేదిలలో రెండు రోజుల పాటు హాలియా పట్టణ కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా 24వ మహాసభలకు వేదిక కానున్నాయని ఈ మహాసభలకు జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుండి విద్యార్థి ప్రతినిధులు పాల్గొని జిల్లాలో ఉన్న విద్యారంగ సమస్యలపై చర్చించడం జరుగుతుందని ప్రతిష్టాత్మకంగా జరిగే ఈ మహాసభలలో సామాజిక, రాజకీయ రంగాలలో ప్రముఖులైన మేధావులు పాల్గొనబోతున్నారని ఆయన అన్నారు. అనంతరం నూతన డివిజన్ కమిటిని ఎన్నుకోవడం జరిగింది. మహాసభ ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు సురిగి వినయ్ అధ్యక్షతన జరిగింది. ఈకార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు వినయ్, డివిజన్ శివకుమార్, ఉపాధ్యక్షులు సహాయ కార్యదర్శులు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు భాను, చైతన్య, హన్మంత్ తదితరులు పాల్గొన్నారు.



## నేడు శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** నేడు జిల్లా కేంద్రంలోని బంజారా భవన్‌లో బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు బంజారా నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని బంజారా భవన్‌లో నిర్వహించిన లంబాడ సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం బంజారా భవన్‌కు డిజె సౌండ్ సిస్టమ్ బహుకరించిన ఏఐబిఎస్ఎస్ యూత్ జిల్లా అధ్యక్షులు లావుడ్య బాలాజీ నాయక్‌ను నాయకులు ఘనంగా సన్మానించారు. లూనావత్ పాండు నాయక్, ధరావత్ వీరన్న నాయక్, గుగులోతు నాగు నాయక్, ధరావత్ చత్రు నాయక్, లావు డ్య బాలాజీ నాయక్, ధరావత్ రెడ్యా నాయక్ పాల్గొన్నారు.

## 20 వరకే సిసిఐ పత్తి కొనుగోళ్ళు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సిసిఐ వారిచే పత్తి కొనుగోళ్ళు ఈనెల 20 వరకు మాత్రమే జరుగుతాయని జిల్లా మార్కెటింగ్ అధికారి కోటా నాగేశ్వర శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కపాస్ కిసాన్ యాప్ నందు రిజిష్టర్ అయినటువంటి రైతులు స్లాట్ బుక్ చేసుకొని ఈనెల 20లోగా వారికి విక్రయించుకొని మద్దతు ధర పొందాలని కోరారు.

## కుమార్ జీవితం ఆదర్శం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కామ్రేడ్ తాంద్ర కుమార్ జీవితం భావితరాలకు ఆదర్శనీయమని ఎంసిపిఐయు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వరికుప్పల వెంకన్న, జిల్లా కార్యదర్శి షేక్ నజీర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని భీమిరెడ్డి నరసింహారెడ్డి విగ్రహం వద్ద కామ్రేడ్ తాంద్ర కుమార్ నాలుగో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హైదరాబాద్ మహానగరంలో పదిహేడు బస్తీలను నిర్మించిన భూపోరాటయోధుడు అమరజీవి తాంద్ర కుమార్ త్యాగం వృధాకాదన్నారు. నక్క శ్రీనివాస్, లింగంపల్లి రాజు, శ్రీరామోజు ఉమేష్, శబరి వైభవ్ పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** అడ్డగూడూరు గ్రామ పంచాయతీ సిబ్బంది రోడ్డు ప్రమాదంలో బోడ చంద్రయ్య వయస్సు (50) మరణించగా దహన సంస్కారల కోసం రూ.10 వేలు నూతన సర్పంచ్ పూజరి వనజ సైదులు గౌడ్ చంద్రయ్య కుటుంబానికి శనివారం అందజేశారు. ఆయనతో పాటు ఉప సర్పంచ్ వరిగడ్డి లోకేష్, కార్యదర్శి నరేష్, వార్డు సభ్యులు ఉన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు కడారి రమేష్ రూ.5 వేలు, గ్రామస్తులు తోచినంత ఆర్థిక సహాయం అందించారు. అడ్డగూడూరు ప్రజలు బందు మిత్రులు అంతిమ యాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులు అర్పించారు.



## సరస్వతి స్కూల్లో స్వపరిపాలన వేడుకలు




**ప్రజాపక్షం/నకిరేకల్ :** పట్టణంలోని శ్రీ సరస్వతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన వేడుకలు నిర్వహించారు. సి.ఎస్‌గా ఆర్. జస్వంత్, ఎడ్యుకేషనల్ మినిస్టర్‌గా డి.స్నేహిత, జిల్లా కలెక్టర్‌గా పి.లికిత,జాయింట్ కలెక్టర్‌గా టి.రేణు శ్రీ,ఆర్జెడి గా సిహెచ్.స్వాతి, డీఈవోగా ఎస్. తేజశ్రీ,తహశిల్దార్‌గా జీ.వైష్ణవి,ఆర్‌డిఓగా ఎండి. అఫ్రీన్, ఎంఈఓగా వి. పూజ,హై స్కూల్ ప్రిన్సిపల్‌గా వి. తనుష్మ, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపల్‌గా వెన్నెలతో పాటు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులుగా,పీఈటీలుగా వివిధ పాత్రలను విద్యార్థులు ధరించారు.అనంతరం ముగింపు సమావేశంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమొంటోలు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మారుపాక నర్సయ్య, ఏవో సురేష్, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం గుర్తించని దేవాలయం



**ప్రజాపక్షం/మోతె :** పేరుగాంచిన పెద్ద దేవాలయం నేటికి ప్రభుత్వం గుర్తింపు లేక అభివృద్ధికి నోచుకోవడం లేదు. మండలంలోని కూడలి గ్రామంలో గడిచిన శతాబ్ది కాలంపైగా పూజలందుకుంటున్న సంగమేశ్వర దేవాలయం ప్రతి సంవత్సరం మూడు నుంచి ఐదు రోజులపాటు మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నప్పటికి ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్, కృష్ణా జిల్లాల నుంచి భక్తులు జాతరకు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. కూడలికి ఒక ప్రత్యేకత ఉన్నదని గ్రామస్తులు చెప్పుకుంటున్నారు. చిన్నా పెద్దా, కుల మతాలకు అతీతంగా సంగమేశ్వర దేవాలయం వద్ద పూజలు నిర్వహించడం జరుగుతుందని ఈ దేవాలయం పరిధిలో సుమారు 4000 ఎకరాల భూమి దేవాలయం ధర్మకర్త కక్కునూరి నర్సింహారావు ఆధీనంలో ఉండగా ఇప్పటికే సుమారు 1500 ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టడం జరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా దేవాలయం ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకొని అభివృద్ధి చేపట్టాలని అధికారులను కోరుకుంటున్నారు.

## మహాశివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జిల్లా కేంద్రంలోని శ్రీసంతోషిమాత దేవాలయంలో వేంచేసియున్న శ్రీసత్యసాంబ శివ స్వామి వారి మహాశివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధమైనట్లు దేవాలయ అధ్యక్షులు బ్రాహ్మండ్లపల్లి మురళీధర్ తెలిపారు. శనివారం మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా దేవాలయంలో రుద్ర హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తులే స్వయంగా స్వామి గర్భగుడి లోనికి ప్రవేశించి మీ స్వహస్తాలతో అభిషేకం చేసుకోవచ్చని తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు సామూహిక శివ అష్టోత్తర నామపూజ, రుద్ర హోమం, సాయంత్రం 6 గంటలకు శివలింగాకృతిలో దీపోత్సవం, రాత్రి 9 గంటలకు లింగోద్భవ కాల అభిషేకములు, రాత్రి 1 గంటకు ఎదుర్కోలు మహోత్సవం అనంతరం శ్రీపార్వతి పరమేశ్వరుల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించబడుతుందని వివరించారు. మరుసటి రోజు ఉదయం 9 గంటలకు మహాపూర్ణాహుతి అన్నాభిషేకం, అన్నప్రసాద కార్యక్రమం ఉందన్నారు. ఇతర వివరాలకు దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం 8341816141 ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూక వెంకటేశం గుప్తా, పబ్బా ప్రకాశరావు, కొత్త మల్లికార్జున్, నరేంద్రుని విద్యాసాగర్, కక్కరేణి పద్మ పాల్గొన్నారు

## బిసి మహిళకు అవకాశం కల్పించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ మున్సిపల్ ఛైర్మన్ జనరల్ మహిళకు రిజర్వేషన్ అయినందున జనరల్ స్థానంలో బీసీ మహిళకు కేటాయించి బీసీలకు న్యాయం చేయాలని బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆయన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందించి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జనరల్ స్థానంలో అగ్రవర్ణాలకే మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ రెండింటిని ఇచ్చి బీసీలను మోసం చేశారని, జనాభాలో సగానికి పైగా బీసీలకు న్యాయం జరగాలంటే బీసీలకే మున్సిపల్ ఛైర్మన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మిర్యాలగూడ మున్సిపల్ పరిధిలో 48వార్డుల్లో సగానికి పైగా బీసీలు గెలుపొందారని జనాభా దామాషా ప్రకారం బీసీలకు మున్సిపల్ ఛైర్మన్ పదవి ఇవ్వాల్సిందేనన్నారు. కార్యక్రమంలో దొనేటి శేఖర్, ఎస్పీ నాయుడు, రామకృష్ణ, నరేష్, రోహిత్, రవి, గోపాల్, వెంకటేష్, క్రాంతి, శేఖర్, రమేష్, రాములు, సురేందర్, లక్ష్మీ , సుధా, అనురాధా, జ్యోతి, శ్వేత, రాధా, మహేశ్వరి పాల్గొన్నారు.





## ముత్యాలమ్మ బోనంతో మొక్కులు చెల్లించుకున్న సుష్మామురళి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యనగాని నాగన్నగౌడ్ ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని 5వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు వార్డు ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ హుజూర్‌నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ జెండాలతో మోటార్ సైకిళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం యరగాని నాగన్నగౌడ్ దంపతులను 5వ వార్డు కౌన్సిలర్ దంపతులను వార్డు కమిటి సభ్యులు పూలమాలలతో శాలువాలతోఓ ఘనంగా సత్కరించారు. అనంతరం పట్టణంలోని ముత్యాలమ్మ తల్లికి బోనంతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి మాజీ ఉపాధ్యక్షులు షేక్ మహ్మద్, మన్సూర్ అలీ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు యరగాని శ్రీనివాసగౌడ్, బూతఖ్ కమిటి సభ్యులు తోట యల్లయ్య, శీలం సైదులు పాల్గొన్నారు.

## బిసిలకు కేటాయించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని బిసిలకు కేటాయించాలని పిసిసి ఓబిసి విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ బెంజారపు రమేష్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. సమాజంలో సింహభాగం ఉన్న బిసిలకు వైస్ చైర్మన్ పదవి కేటాయించేలా చొరవ తీసుకోవాలని టిపిసిసి, సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ కమిటిలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం శాసనసభలో బిసిలకు 42శాతం కల్పిస్తూ శాసనసభ తీర్మానం చేసి బిసిలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టో, కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం సామాజిక న్యాయం కల్పించేలా రాష్ట్రవ్యాప్తంగా బిసిలకు మునిస్పల్ చైర్మన్, వైస్‌చైర్మన్ పదవుల్లో సముచిత ప్రాధాన్యత కల్పించాలన్నారు.

## బిసి మహిళకు కేటాయించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ మున్సిపల్ ఛైర్మన్ స్థానం జనరల్ మహిళకు రిజర్వ్ అయినందున బీసీ మహిళకు కేటాయించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరుమలగిరి అశోక్ అన్నారు. ఈమేరకు శనివారం ఆయన క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందించి ఆయన మాట్లాడారు. మున్సిపల్ ఛైర్మన్ పీఠం నేటి వరకు బీసీలకు దక్కకపోవడం బాధాకరమని, మిర్యాలగూడ నియోజకవర్గంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలకు సముచిత స్థానం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి మిర్యాలగూడ మున్సిపల్ ఛైర్మన్ పీఠం బీసీలకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పోలగాని వెంకటేష్‌గౌడ్, బోయపల్లి రవీందర్ గౌడ్, ఎర్రబెల్లి గంగాధర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## మహిళ సంఘ భవన నిర్మణానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని ఇబ్రాహింపురం గ్రామంలో ఉపాధిహామీ నిధులతో పదిలక్షల వ్యయంతో నిర్మించే మహిళా సంఘం భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ మన్నెపు రజిత తిరుపతి రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మహిళల సాధికారత, మహిళల అభివృద్ధి దిశగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలోఇబ్రాహింపురం గ్రామ ఉప సర్పంచ్ నాగాయపల్లి శివరాములు, వార్డు మెంబర్లు పండుగ పద్మ, బూరుగు ఉపేందర్ రెడ్డి, నీలం మధు యాదవ్, గడిపే కవిత, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ గడిపే ఇంద్రయ్య పాల్గొన్నారు.



## 16న ప్రజావాణి రద్దు

ప్రజాపక్షం/ప్రజాపక్షం : మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున, 16న (సోమవారం) నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

## 6వ వార్డు అభివృద్ధికి కృషి



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; కొండమల్లేపల్లి పట్టణంలోని 6వ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆ వార్డు సభ్యులు ఊరే నరేష్ అన్నారు. శనివారం 6వ వార్డులో ఉన్నటువంటి కంప చెట్లను జేసీబితో తొలగింపజేసి, చెత్త చెదారంను గ్రామ పంచాయతీ ఆటోల ద్వారా తరలించారు. పేరుకుపోయిన డ్రైనేజిని గ్రామ పంచాయతీ సిబ్బందితో తొలగించారు. ఈసందర్భంగా ఊరే నరేష్ మాట్లాడుతూ సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి సహకారంతో 6వ వార్డులో ఉన్న సమస్యలన్నింటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని అన్నారు.

## బత్తిని రాములు ఆశయ కృషి

ప్రజాపక్షం/గరిడేపల్లి: స్వర్గీయ కామ్రేడ్ బత్తిని రాములు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పారెపల్లి శేఖర్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని పొనుగోడు గ్రామంలో బత్తిని రాములు 27వ వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపం వద్ద పూలమాలలువేసి నివాళులర్పించారు. పొనుగోడు, కోదండరామపురం, కుతుబ్‌షాపురం, వెలిదండ గ్రామాల్లో అంది నర్సయ్య, సుందరి బసవయ్యలతో సమానంగా ఉంటూ పోరాటాల్లో పాల్గొన్నారని అన్నారు. రాములు హుజూర్‌నగర్ డివిజన్ కార్యదర్శిగా ఉమ్మడి నల్లగొండ జిల్లా కమిటి సభ్యులుగా పనిచేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి యాకుబ్, సీనియర్ నాయకులు తుమ్మల సైదయ్య, అంబటి బిక్షం, దోసపాటి బిక్షం పాల్గొన్నారు.

## రంజాన్ కిట్లు పంపిణీ

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలోని కృష్ణసాయి ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ మహానంద చౌదరీ సహకారంతో శనివారం పట్టణంలోని పలువురు ముస్లీం పేద కుటుంబాలకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో హ్యూమన్ రైట్స్ డిఫెండర్ హమీద్ షేక్ రంజాన్ కిట్లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది పవిత్ర రంజాన్ మాసంలో పలు ముస్లీం కుటుంబాలకు రంజాన్ కిట్లను అందచేస్తున్న డాక్టర్ మహానంద చౌదరీ సేవలు అద్వితీయమని అన్నారు. రంజాన్ ఉపవాస దీక్షలను ముస్లీం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీను, వహీద్, నర్సింహా, జయేష్ తదితరులు ఉన్నారు.



## బిసిల సింహ గర్జన పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/నాంపల్లి: మండలంలోని టి.పి.గౌరారం చలిదోనలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ప్రాంగణంలో భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో శనివారం బీసీల సింహ గర్జన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు తీగల అశోక్ కుమార్,తెలంగాణ అమరవీరుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కోరే సాయిరాం ముఖ్య అతిథులుగా హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించి వారు మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన జరగనున్న బీసీల సింహ గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన సన్నాహక చర్యలపై బీసీ నాయకులతో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. ఎస్సి,ఎస్టిలకు ఉన్న రక్షణ చట్టాల మాదిరిగానే బిసిలకు కూడా ప్రత్యేక రక్షణ చట్టం అవసరమని పేర్కొన్నారు. బిసిల హక్కులు, బహుజన రాజాధికారం సాధన కోసం బీసీ సంఘాల నాయకులు సామాజిక కార్యకర్తలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలోబిసి సంఘాల నాయకులు,పార్టీ కార్యకర్తలు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జీనియస్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే




ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : పట్టణంలోని జీనియస్ పాఠశాలలో శనివారం యూకేజీ విద్యార్థులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ బి.సూర్యనారాయణ రెడ్డి, చైర్మన్ పడాల శ్రీనివాస్, డైరెక్టర్ తోట శ్రీధర్ హాజరయ్యారు. ఇట్టి కార్యక్రమంలో ముందుగా వారు జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం విద్యార్థులకు పట్టాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డాక్టర్ బి.సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు మా ఉపాధ్యాయులు నూతన విద్యా విధానంతో పాఠాలు బోధిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తోట శ్రీధర్, ప్రిన్సిపల్ బి.స్వర్ణలత, ఏవోజి రవి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్పొరేటర్లకు ఘన సన్మానం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో నూతనంగా గెలుపొందిన మున్సిపల్ కార్పొరేటర్లకు డాక్టర్ ఏపి ఖాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘన సన్మానం నిర్వహించారు.45వ డివిజన్ కార్పొరేటర్ జెఎన్‌బి మొహమ్మద్ అష్రఫ్ అలీ అమీర్, 23వ డివిజన్ కార్పొరేటర్ జెఎన్‌బి మొహమ్మద్ మహబూబ్ అలీ ఇంతియాజ్ లకు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలియజేశారు.రాష్ట్ర రహదారులు భవనాల శాఖ,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి.శ్రీనివాస్ రెడ్డిల నాయకత్వంలో విజయం సాధించిన ఈవిజయంపై హర్షం వ్యక్తం చేశారు.నూతన కార్పొరేటర్లు తమ తమ డివిజన్,వార్డుల అభివృద్ధి కోసం కృషి చేసి ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాసేవకు కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఎండీ షరీఫుద్దీన్ (నేషనల్) ,ఎంఏ జలీల్,కాలీముల్లాహ్ అన్సరీ,ఎంఏ అలీం ఇక్బాల్ తదితరులు పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

## అధైర్య పడొద్దు – అండగా ఉంటాం



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మున్సిపల్ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమిపాలైన బీఆర్ఎస్ అభ్యర్థులను ఆ పార్టీ యువనేత సిద్ధార్థ శనివారం పరామర్శించారు. అభ్యర్థులెవరూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. శుక్రవారం గెలుపు అంచున ఆగిపోయిన అభ్యర్థుల నివాసాలకు ఆయన స్వయంగా వెళ్లి వారిలో ధైర్యాన్ని నింపారు. అభ్యర్థులతో పాటు వారి కుటుంబసభ్యులతో మాట్లాడి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఎన్నికల్లో ఓటమిపాలైన అభ్యర్థులు ఓటమితో కుంగిపోవద్దని సూచించారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజల కోసం పనిచేసే తత్వం బీఆర్ఎస్ కార్యకర్తల డీఎన్ఏలో ఉందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా పోరాడుదామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దుర్గంపూడి నారాయణరెడ్డి, బైరం సంపత్, పల్సాటి జానకిరెడ్డి, అంజి, బూర సైదులు, క్రాంతి, తుమ్మల ఫణికుమార్, ఎండి.షోయబ్, వినోద్‌కుమార్, రమావత్ వినోద్‌నాయక్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## 16న చందూరు మున్సిపాలిటీ చైర్మన్‌గా డాక్టర్ కోడి శ్రీనివాసులు ప్రమాణస్వీకారం




ప్రజాపక్షం/చందూరు: ఈ నెల 16న చందూరు మున్సిపాలిటీ చైర్మన్‌గా డాక్టర్ కోడి శ్రీనివాసులు పదవి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మున్సిపాలిటీ 6వ వార్డు నుండి డాక్టర్ కోడి శ్రీనివాసులు కౌన్సిలర్‌గా గెలుపొందారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి కుడి భుజంగా ఉన్న కోడి శ్రీనివాసులును మున్సిపాలిటీ ఎన్నికల ముందే చైర్మన్ గా ప్రకటించి ఎన్నికల రంగంలోకి దిగారు. అనుకున్న విధంగానే చందూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ సిపిఐ మిత్రపక్షాల కూటమి అభ్యర్థులు 7 స్థానాలలో విజయం సాధించి చందూరు మున్సిపాలిటీని కైవసం చేసుకున్నారు.



## శరీర దానం ఒక విజ్ఞాన గ్రంథం

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ఒక వ్యక్తి తన మరణానంతరం మట్టిలో వృధాగా కలిసిపోకుండా వైద్య విద్యార్థుల పరిశోధనకు ఒక విజ్ఞాన గ్రంథంగా ఉపకరిస్తుందని సూర్యాపేట స్పందన శరీర, అవయవ దాన సంస్థ సభ్యులు తెలిపారు. శనివారం పట్టణంలోని చర్చి కంపౌండ్‌లో ఉప్పల ఈశ్వరమ్మ (71), ఆదెపు సత్తెమ్మ (61) ఇరువురు గృహిణులు తమ శరీర దాన అంగీకార పత్రాలను సంస్థ అధ్యక్ష కార్యదర్శులు గుండా రమేష్, మిట్టకోల కోటయ్యలకు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవ అధ్యక్షులు, సామాజిక వేత్త గుండా రమేష్ మాట్లాడుతూ అవయవ దానం, శరీర దానం చేయడం త్యాగానికి ప్రతీకయని, సత్సంకల్పంతో తమ అంగీకారం తెలిపిన దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల సత్యనారాయణ పాల్గొన్నారు.

## మహాశివరాత్రికి అన్ని ఏర్పాట్లు సిద్ధం




ప్రజాపక్షం/నూతనకల్ : మండలంలోని పెదనెమిల గ్రామంలో వెలసిన శ్రీ ఉమా నాగలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త గుండా వీరన్నజ్యోతి తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా దేవాలయంలో ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు స్వామి వారికి అభిషేకములు నిర్వహించనున్నట్లు వివరించారు. రాత్రి 8 గంటలకు స్వామి వారి కళ్యాణ మహోత్సవం, రాత్రి 12 గంటలకు లింగోద్భవం, మహాభిషేకం జరిపించబడుతుందని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు.

## నర్సింగ్ సేవలతో ఆరోగ్య సమాజం



ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ : నర్సింగ్ విద్యార్థినులు సేవాభావంతో వైద్యశాలల యందు సేవలందించి ఆరోగ్య సమాజాన్ని నిర్మించాలని చందన గ్రూప్ విద్యా సంస్థల విద్యా పాలనాధికారి గుండా రమేష్ కోరారు. శనివారం బిఎస్సి నర్సింగ్ ఫైనల్ సంవత్సరం విద్యార్థినుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విద్య అత్యంత పవిత్రమైందని, ఈ విద్యను అభ్యసించిన విద్యార్థినులు ఉపాధి అవకాశాలు ఎక్కువగా పొందుతారని చెప్పారు. విద్యాసంస్థల డైరెక్టర్ కె మధుసూదన్ రెడ్డి సభకు అధ్యక్షత వహించగా ఫిజియోథెరపి ప్రిన్సిపాల్ కె వేణుగోపాల్ రెడ్డి, బిఈడీ కళాశాల ప్రిన్సిపాల్ జి శ్రవణ్ కుమార్, కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ పావని, బోధన, భోదనేతర సిబ్బంది పాల్గొన్నారు

## నందాగుట్టలో మహా శివరాత్రికి సన్నాహాలు



ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : నందాగుట్టలో నిలగిరి థియటర్ దగ్గర మహా శివరాత్రి వేడుకల సందర్భంగా ప్రత్యేక శుభ్రత కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని మాజీ కౌన్సిలర్ పంగరెక్కస్వామి ఆధ్వర్యంలో చేపట్టారు. మహా శివరాత్రి సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాలు, ప్రధాన రహదారులు మరియు గుట్ట ప్రాంతాన్ని పూర్తిగా పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో పరిమేష్, పాండు, నరేష్, వేరేశం, పర్వతాలు, గుడి పూజారి మహేశు తదితరులు పాల్గొని శుభ్రత కార్యక్రమంలో చురుకుగా సహకరించారు. స్థానికులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, సమాజ సేవకు ఇది ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.



## బియ్యం అందజేత

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మండలంలోని గోపలాయపల్లి గ్రామానికి చెందిన బైరాబోయిన ఆంజనేయులు ఇటీవల అకాల మరణం చెందడంతో శనివారం ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడి హరికృష్ణ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం సంస్థ తరపున 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపత్కాలంలో ఉన్న ప్రజలకు తోడుగా ఉండటం ఆసరా సంస్థ లక్ష్యమని అన్నారు.ఈకార్యక్రమంలో దేశగాని లెనిన్, గుండబోయిన శ్రీనివాస్,కానుగ జానీ, ఎల్లాచారి పాల్గొన్నారు.

## చెర్వుగట్టులో అన్నదానం



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** జిల్లాలో ప్రముఖ క్షేత్రమైన శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో జన్మదినంను పునస్కరించుకొని అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శనివారం మండలంలోని ఎల్లారెడ్డి గూడెం గ్రామానికి చెందిన వడ్డే శ్రీనివాస్ రెడ్డి తన జన్మదినంను పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ ఇల్లందుల లింగస్వామి,ఉప సర్పంచ్ వడ్డే భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## నేటి నుంచి పేరూరు జాతర ప్రారంభం

**ప్రజాపక్షం/హాలియా:** అనుముల మండలంలోని పేరూరు గ్రామంలో శతాబ్దాల చరిత గలిగిన శ్రీ స్వయంభు సోమేశ్వర స్వామి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం అవుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రిక్కల కొండారెడ్డి తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా పేరూరు గ్రామంలో వెలసిన శ్రీ స్వయంభు సోమేశ్వర స్వామి ఉత్సవాలను మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. శివరాత్రి సందర్భంగా నేడు ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి కళ్యాణం సోమవారం ఉదయం జరుగుతుందని తెలిపారు. చారిత్రక చరిత్ర కలిగిన శ్రీ సోమేశ్వర స్వామి ఆలయం ఇది. వందల చరిత్ర ఉన్న ఈ స్వామి ఉత్సవాలలో పాల్గొనేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ కొండారెడ్డి తెలిపారు.



## గురుకులంలో పేరెంట్స్,టీచర్స్ కమిటీ సమావేశం



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మండలంలోని ఎల్లారెడ్డి గూడెం వద్ద గల నకరేకల్ ఎస్‌సి గురుకులం హాస్టల్ లో తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. శనివారం గురుకులం కార్యదర్శి ఆదిత్య కృష్ణ ఆదేశాల మేరకు ఆర్ నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హాస్టల్లో మెరుగైన వసతులు కల్పించాలని టీచర్లు సరైన సమయానికి రావాలని భోజన వసతులు మెను పాటించాలని అలాగే చదువు విషయంలో అదనపు సమయం పిల్లలు చదువులో మెరుగుపరచాలని, క్రీడలలో రాణించాలని ఆయన కోరారు.ఇంచార్జ్ ప్రిన్సిపల్ నర్సింగరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు సరైన మార్గంలో నడిచే పిల్లలకు చదువు విషయంలో సహకరిస్తామని తెలిపారు.పిల్లలు చక్కటి విద్యాబుద్ధులు నేర్చుకొని భావి భవిష్యత్తును కాపాడాలని అందుకు తల్లిదండ్రుల పాత్ర చాలా ముఖ్యమైందని అలాగే ఉపాధ్యాయుని పాత్ర కూడా అంతే విలువని ఆయన కొనియాడారు.ఈసమావేశంలో తల్లిదండ్రుల కమిటీ విద్యా కోశాధికారి మర్రి రమేష్,కమిటీ సభ్యులు రేకల భిక్షం ,దశరథ,సైదులు,టీచర్లు వైస్ ప్రిన్సిపల్ శశిధర్,సుధాకర్,భద్రయ్య,ఫిరోజ్ ఖాన్,పిఈటీ కొంగరి వెంకటేశ్వర్లు,మహేష్,తదితరులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి వేడుకలకు అక్కన్న మాదన్న ఆలయం ముస్తాబు



**ప్రజాపక్షం/బీబీనగర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని మహాదేవపూర్ గ్రామంలో గల శ్రీ భక్త రామదాసు నిర్మాణం చేపట్టిన వేణుగోపాల స్వామి ఉమామహేశ్వర ఆలయం మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయింది. ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 17 వరకు స్వామివారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి రుద్ర వెంకటేష్ తెలిపారు. మహాశివరాత్రి పురస్కరించుకొని ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా విద్యుత్తు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు గ్రామ సర్పంచ్ దండం అనిత ప్రభాకర్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంకాలం భజన కీర్తనలతో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా మండలంలోని చిన్న రావులపల్లి గ్రామంలో గల శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, గూడూరు గ్రామంలో గల శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయం, బిబినగర్ పట్టణంలో గల శివాలయం, పడమటి సోమవారం గ్రామంలో గల శ్రీ లింగ బసవేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలకు అధికారులు ఏర్పాటు చేశారు. ఈ మహాశివరాత్రి సందర్భంగా భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆలయ అధికారులు తెలిపారు.

## సృజనాత్మకతను వెలికి తీసేందుకు స్వపరిపాలన దోహదం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఒక్కరోజు స్వపరిపాలన కార్యక్రమాలు దోహదపడతాయని సప్తగిరి పాఠశాల డైరెక్టర్ బొల్లం లింగయ్య యాదవ్ అన్నారు. శనివారం పట్టణంలోని సప్తగిరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా, అధికారులుగా, డాక్టర్లుగా,ప్రజా ప్రతినిధులుగా చక్కటి అభినయాన్ని హుందాతనాన్ని ప్రదర్శించారు. అనంతరం అపాఠశాల నుండి గడియారం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి పూలే విగ్రహానికి, తెలంగాణ మలి దశ తొలి అమరుడు శ్రీకాంత్ చారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యాశాఖ మంత్రిగా నేహా ఎమ్మెల్యేలు కే మోహన్,సాయి తరుణ్,సాయికిరణ్, భీమ్, జిల్లా కలెక్టర్ పూజ,జిల్లా ఎస్‌పి వంశీ,డీఈవో రామ్ చరణ్,ఎంఈవో ప్రసన్న పాఠశాలను సందర్శించి పరిశీలించడం, తనిఖీలు చేయడం ఆకట్టుకుందనీ అన్నారు. అనంతరం ఉపాధ్యాయుల వ్యవహరించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సైదులు, ఉపాధ్యాయులు మూర్తి,నరసింహ,శంకర్,గౌస్, శ్రీకాంత్, ఫాహిమా,సరిత,ధనలక్ష్మి,కళ్యాణి,నాగమణి విద్యార్థులు పాల్గొన్నారు.

## తయూభ్ మృతికి ఎమ్మెల్యే వీరేశం నివాళి



**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ మున్సిపాలిటీ 15వ వార్డుకు చెందిన కానిస్టేబుల్ షేఖ్ తయూభ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.శనివారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.వారి వెంట నాయకులు యాసరపు వెంకన్న, గాజుల సుకన్య, కొండ వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**కానిస్టేబుల్ మృతికి దైద నివాళులు**

కానిస్టేబుల్ షేఖ్ తయూభ్ విధులు ముగించుకొని మునుగోడు నుంచి వస్తుండగా చందనపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.మృతదేహాన్నికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.



## 22న బిసి సింహ గర్జనకు సంపూర్ణ మద్దతు

**ప్రజాపక్షం/మర్రిగూడ:** ఈనెల 22న నిర్వహించనున్న బీసీ సింహ గర్జన సభకు తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన సమితి పూర్తి మద్దతు ప్రకటించింది. బీసీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునే దిశగా నిర్వహిస్తున్న ఈ మహాసభ విజయవంతం కావాలని సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోరె సాయిరాం పిలుపునిచ్చారు.సింహ గర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల హక్కులు,అవకాశాల పరిరక్షణ కోసం ఉద్యమ నాయకులు అందరూ ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సభకు బీసీ వర్గాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నల్లగొండ జిల్లా అధ్యక్షులు కొలుకులపల్లి యాదయ్య,పగడాల లింగయ్య, తెలంగాణ రజక సేవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పగడాల లింగయ్య,తీగల అశోక్ కుమార్,ఆకుల రఘుమయ్య,వెంకటంపేట బాలయ్య,మాస చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## శ్రీ సిద్ధేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూరు మండలంలోని చందేపల్లిలో శ్రీ సిద్ధేశ్వర స్వామి 20వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఉదయం గణపతి పూజ, పుణ్యా హవాచనం, దీక్షా కంకణధారణ, మంటపారాధన, శత ఘటాభిషేకం దిష్టి కుంబాల కార్యక్రమాలను సిద్ధాంత కళాప్రపూర్ణ బ్రహ్మశ్రీ దైవజ్ఞ సత్యనారాయణ శాస్త్రి సిద్ధాంతి, పండిత్ ఆకుల కోటేశ్వర్ వీరశైవ ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తలు సుదగాని భారతమ్మ జయరాములు గౌడ్, సుదగాని మంజుల మల్లేష్ గౌడ్‌లు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోట్ల నగేష్, ఉప సర్పంచ్ ఏనుగు అంజిరెడ్డి, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ ఏనుగు సత్తిరెడ్డి, వార్డు సభ్యులు గంగరాజు నాగరాజు, దుధిపాల జ్యోతి, బోట్ల సంజీవ, భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు అయ్యారు.

## శివాలయంలో ఘనంగా మహోత్సవాలు ప్రారంభం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** పట్టణ కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్నిపురస్కరించుకు నిమూడురోజులమహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం వరకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.మొదటిరోజుమూలవిరాట్టుకు నిత్యాభిషేకాలు,ప్రత్యేక అలంకరణ,మహా హారతి,సర్వదర్శనం నిర్వహించారు. అనంతరం గణపతి పూజ,పుణ్యావాచనం,కలశస్థాపన,రుద్ర హోమం,పూర్ణాహుతి కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.ఆలయ చైర్మన్ ఉప్పల రమేష్ నేతృత్వంలో పురోహితులు జిగురులక్ష్మీనరసింహమూర్తి,జిగురు శివనారాయణ శర్మలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మకర్తలు కందాళ ప్రవీణ్ రత్నారెడ్డి,చెన్న చంద్రశేఖర్ (రవిచంద్ర), కొండ వెంకన్న గౌడ్,బొప్పని యాదగిరి,నకిరేకల్ ఎస్‌ఐ గడగోజు కృష్ణమాచారి పాల్గొన్నారు.



# శివనామ స్వరంతో మారుమోగనున్న శివాలయాలు..

## ముస్తాబైన ఆలయాలు.. జాగారాలు చేయనున్న భక్తులు..



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని పానగల్ సమీపంలో ఉన్న ఛాయా సోమేశ్వరాలయంలో, పచ్చల సోమేశ్వరాలయంలో,అదేవిధంగా పలు శివాలయాల్లో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను చేశారు. ముఖ్యంగా ఛాయా సోమేశ్వరాలయంలో తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. పరమశివునికి ఎంతో ప్రీతికరమైన రోజు మహాశివరాత్రి అని ధర్మశాస్త్రలు చెబుతున్నాయి. ఈ పవిత్రమైన రోజున ఉపవాసం ఉండటం, జాగరణ చేయడం, రోజంతా శివనామస్మరణతో శివుడికి దగ్గరగా గడపడం, ప్రదోషవేళ శివుడిని అభిషేకించడంతో పాటు. ప్రత్యేకంగా బిల్వార్చన, రుద్రాభిషేకం వంటివి చేయడం అత్యంత శుభప్రదం. ముఖ్యంగామహాశివరాత్రి రోజు ఉపవాసం ఆచరించడం మంచిదని చెబుతారు. అలాగే మహాశివరాత్రి రోజున జాగరణ చేయడం వల్ల అందులోనూ రాత్రి పూట చేసే శివార్చన మరియు శివాభిషేకం వల్ల శరీరంలో తేజస్సు కలుగుతుందని పండితులు చెబుతారు. అలాగే భగవంతుడి మీద సాధకులకు,మోక్ష మార్గంలో ప్రయత్నించే వారికి రాత్రిపూట విశేషమైన సమయంగా భావిస్తారు. శివుడు అభిషేక ప్రియుడు కాబట్టి మహాశివరాత్రి రోజు సాయంత్రం 5,6 గంటల సమయం నుంచి అర్ధరాత్రి 2 గంటల సమయం మధ్యన చేసే రుద్రాభిషేకం, శివార్చన, బిల్వార్చన వల్ల ఆయురారోగ్యాలు,ఐశ్వర్యం కలుగుతాయని పండితులు చెబుతారు.మహాశివరాత్రి రోజున శాస్త్రకంగా శివుడిని ఆరాధించినా లేదా మనకు ఎలాంటి మంత్రాలూ తెలియక కేవలం భక్తి శ్రద్ధలతో శివలింగం మీద చెంబుడు నీళ్ల పోసినా రెండూ సమానమే అంటాడట ఆ కైలాసనాథుడు. మన సంప్రదాయంలో నిత్య శివరాత్రి,పక్ష శివరాత్రి, మాస శివరాత్రి, మహా శివరాత్రి, యోగ శివరాత్రి అనే ఐదు రకాల శివరాత్రులు ఉన్నాయని మన పురాణాలు చెబుతున్నాయి.



## మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

**ప్రజాపక్షం/ శాలిగౌరారం :** మహాశివరాత్రి వేడుకలకు నల్లగొండ జిల్లా వల్లాల గ్రామంలోని పార్వతీ శంభులింగేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాలకు, ఆలయ ధర్మకర్తలు, పూజారులు, గ్రామస్తులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఆలయంలో తొమ్మిది రోజుల పాటు ప్రతి నిత్యం వివిధ రకాల పూజలు నిర్వహించనున్నారు. ప్రతి యేటా నిర్వహించే ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీ ఎత్తున భక్తులు తరలిరానున్నారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి అనుగ్రహం పొందాలని ఆలయ పురోహితులు వావిలాల వేణునాథశర్మ, రామలింగయ్య శర్మ కోరుతున్నారు.



## శ్రీ పార్వతి సమేత పంచముఖ రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/వలిగొండ :** శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానం వెంకటాపురం వలిగొండ మండల పరిధిలోని దేవాలయం నందు 14న శనివారం నుండి తేదీ 15 వరకు నిర్వహిస్తున్న శ్రీ పార్వతి సమేత పంచ ముఖ రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం 4.30 నీ. లకు గణపతి పూజ, పుణ్య వాహవచనం, పంచాంగవ్యము అఖండ దీపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన బేరి పూజ, ధ్వజ రోహణం తదుపరి తీర్థ ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. నిర్వహించడానికి దేవస్థానం కార్య నిర్వాహణాధికారి సెల్వాద్రి మోహన్ బాబు తెలిపారు.

## కనుల పండువగా రథోత్సవం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామంలో శ్రీ శ్రీ రుక్మిణి సత్యభామ గోదా సమేత రాజగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని శనివారం విమాన రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. గ్రామ పుర వీదుల గుండా డప్పువాయిద్యాలతో మహిళల ఆటపాటలతో భజన కీర్తనలతో సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చింతల రామకృష్ణ, గ్రామ సర్పంచ్ ధీరవత్ వెంకటేష్, ఉప సర్పంచ్ రెవెల్లి అశోక్, ఆలయ పూజారి గిరిధర్ చార్యులు, మాజీ సర్పంచ్ బండి కృష్ణ గౌడ్, కమిటీ ఉపాధ్యక్షులు పావిరాల దయాకర్, ప్రధాన కార్యదర్శి ఉడుతల వాసుదేవ్ పాల్గొన్నారు.



## వివాహేతర సంబంధం ఆరోపణలు - ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ చర్యలు

**ప్రజాపక్షం/మర్రిగూడ:** సమాజానికి మార్గదర్శకులుగా ఉండాల్సిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై వివాహేతర సంబంధం ఆరోపణలు వెలుగులోకి రావడంతో ఆయనను సస్పెండ్ చేసిన ఘటన నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని వెంకేపల్లి తండాలో ఇటీవల జరిగిన విషాద ఘటన జిల్లాలో చర్చనీయాంశమైం ది. వ్యక్తిగత కుటుంబ వివాదాల నేపథ్యంలో ఒక వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే.మృతుడి కుటుంబ సభ్యులు,గ్రామస్తులు,ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడి ప్రవర్తన కారణంగా ఈ విషాదం చోటుచేసుకుందని ఆరోపించారు. ఈఘటనపై మండల విద్యా అధికారి (ఎంఈఓ) చెంప్లా నాయక్ విచారణ చేపట్టారు. విచారణ నివేదిక ఆధారంగా సంబంధిత ఉపాధ్యాయుడు ప్రభుత్వ ఉద్యోగ నిబంధనలు ఉల్లంఘించినట్టు తేలడంతో, ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటూ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా విద్యా శాఖ అధికారులు శనివారం తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగిగా నైతిక విలువలు,వృత్తి మర్యాదలు కాపాడాల్సిన బాధ్యత ఉన్నందున ఇలాంటి ఘటనలను అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారని పేర్కొన్నారు.పూర్తి స్థాయి శాఖాపరమైన విచారణ అనంతరం తదుపరి చర్యలు నిర్ణయిస్తామని తెలిపారు. స్థానిక ప్రజలు మాట్లాడుతూ,సమాజానికి ఆదర్శంగా ఉం డాల్సినవారు బాధ్యతగా ప్రవర్తించాలనీ,ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు.



## రూ.లక్ష ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** బొల్లేపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త వరికిప్పల నాగరాజు మృతిచెందడంతో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రూ.లక్ష ఆర్థికసహాయం పంపించారు.ఈమొత్తాన్ని గ్రామ సర్పంచ్ వల్లపు శ్రీనివాస్ రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ కుటుంబ సభ్యులకు అందజేసి,పిల్లల భవిష్యత్తుకోసంవినియోగించుకోవాలని కోరారు.ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ గాదగోని రవి, మాజీ సర్పంచ్ జంజీరాల వెంకన్న,చింతల రవీందర్ రెడ్డి,వరికుప్పలలింగస్వామి,వరికుప్పల విక్టర్,గాదగోని లింగయ్య, చింతల అమృతా రెడ్డి, గట్టిగొర్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్‌లో 16న ప్రమాణ స్వీకారం

### అదే రోజు మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక

**ప్రజాపక్షం/నలగొండ టౌన్:** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్‌ల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 16వ తేదీ సోమవారం నిర్వహించబడనుంది అదే రోజు మేయర్,డిప్యూటీ మేయర్ ఎన్నికల ప్రక్రియ కూడా చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ముందుగా నూతన కార్పొరేటర్లు అధికారికంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.అనంతరం సంబంధిత చట్టాలు,నియమ నిబంధనల ప్రకారం మేయర్ , డిప్యూటీ మేయర్ ఎన్నికలు నిర్వహించబడతాయి.ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా,సజావుగా జరిగేలా అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సమాచారం.కార్యక్రమం నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయబడినట్లు అధికారులు తెలిపారు.సంబంధిత శాఖల అధికారులు,సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశాలు జారీ చేయబడ్డాయి.ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర ప్రకటన విడుదల చేశారు.

## గాంధీ, అంబేద్కర్‌లు భౌతికంగా మాత్రమే వేరు సైద్ధాంతికంగా ఇద్దరు ఒక్కటే

**ప్రజాపక్షం/డిండి;** గాంధీ, అంబేద్కర్లు భౌతికంగా మాత్రమే వేరని, సైదాంతికంగా ఇద్దరు ఒక్కటేనని సామాజిక విప్లవ రణబేరి రాష్ట్ర కన్వీనర్ ఖద్దిజ్ఞాసిడా. ముప్పారం ప్రకాశం నల్గొండ జిల్లా డిండి మండల కేంద్రంలోని ఐబి బంగాళ నందు శనివారం ఆ సంస్థ అభిమానులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాంధీ, అంబేద్కర్ వారసులమని చెప్పే సోకాల్డ్ మేధావులు ఆ మహనీయుల చరిత్రను వక్రీకరించి చెబుతుంటే, ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని మనువాదులు ఈ దేశంలో కుల మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నారని దేశ ప్రజలు మేల్కొనకపోతే ప్రమాదం అని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జై భారత్



సామాజిక విప్లవ రణబేరి నాయకులు ఖద్దిజ్ఞాసి శ్రీకాంత్, సుదీర్, రహేల్‌ఖాన్, దయాకర్, కిరణ్, డిండి మండల నాయకులు హుస్సేన్, రేణయ్య, హరీష్, బాలయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

## స్వప్నకు వృక్ష శాస్త్రంలో డాక్టరేట్!



**ప్రజాపక్షం/హాలియా:** రాజస్థాన్లోని శ్రీ జగదీష్ ప్రసాద్ జబర్మల్ తిబ్రేవాలా యూనివర్సిటీ నుంచి పసుల స్వప్న వృక్షశాస్త్రంలో డాక్టరేట్ పట్టా సాధించింది. అనుముల మండలం పేరూరు గ్రామానికి చెందిన పసుల స్వప్న ఈస్టడీ ఆన్ స్పెషల్ స్పీసీస్ అవైలబుల్ ఇన్ నేచర్ అండ్ దేర్ ఇంపాక్ట్ ఆన్ డిక్రీజింగ్ ఎయిర్ పొల్యూటెన్స్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై డాక్టర్ దినేష్ కుమార్ సింగ్ పర్యవేక్షణలో ఈపరిశోధన నిర్వహించారు. దీనికిగాను స్వప్నకు డాక్టర్ పట్టాను అందించారు.వృక్ష శాస్త్రంలో పట్టా సాధించిన పసుల స్వప్న తన ఇన్నాళ్ల కల సహకారమైందని తెలిపారు. తనకు డాక్టరేట్ రావడానికి సహకరించిన అధ్యాపకులకు,కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.